క్లుప్తంగా

ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని కల్పించాలి


ఓజిలి రైతు పొలంలో ఫారంపాండ్స్ పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఓజిలి: ఉపాధిహామీ పథకంలో ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం ఓజిలిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలు ఉదయమే పనులకు వెళ్లి ఎండ పెరగకముందే పనులు ముగించుకోవాలన్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పనలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీవో ఉషారాణి, టీఏ శ్రీనివాసులు, ఎఫ్ఏ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నాపత్రాలు


ప్రశ్నాపత్రాలను భద్ర పరుస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలు శనివారం వెంకటగిరి పోలీసు స్టేషన్‌కు చేరాయి. వాటిని ఎంఈవో-1, 2 వెంకటేశ్వర్లు, బాబయ్య పర్యవేక్షణలో రూట్ ఆఫీసర్లు భద్రపరిచారు. వెంకటగిరిలో 6 సెంటర్లలో 1,024 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి విడత ప్రశ్నాపత్రాలు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి

చిల్లకూరు : ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని గూడూరుకు చెందిన యునైటెడ్ హ్యాండ్స్ సొసైటీ సభ్యుడు మల్లికార్జున్ కోరారు. బెంగళూరులోని ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శనివారం అట్రాసిటీ యాక్ట్‌పై నిర్వహించిన సౌత్ ఇండియా వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలలో ఎక్కువ మంది నిరక్షరాస్యులుగా ఉన్నారని తెలిపారు. అందు వల్లే వారిపై దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. వాటిని అరికట్టేందుకు మేధావులు కృషి చేయాలని కోరారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి


సైదాపురంలో బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం నేతలు

సైదాపురం: సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డిపి పోలయ్య డిమాండ్ చేశారు. సైదాపురంలో శనివారం ప్రపంచ మహిళా పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ చేపట్టారు. పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ స్త్రీ-పురుష సమానత్వం కోసం పోరాటం చేయాలన్నారు. సమాన పని-సమాన వేతనం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పందిటి ఇంద్రమ్మ, అడసనపల్లి నాగమణి, పెంచలమ్మ, పసపల అనూష, నాగమణి, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌కు ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న మహిళా కండక్టర్

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.రత్న శనివారం ఉత్తమ మహిళా కండక్టర్‌గా అవార్డు అందుకున్నారు. తిరుపతిలో ఏపీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు అవార్డు అందజేశారు.

పెళ్లైన ఏడు నెలలకే..

కోట: మండలంలోని గూడలి అరుంధతీయవాడలో శనివారం యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ పవన్‌కుమార్ కథనం.. మెట్టుకు పుల్లయ్య, అరుణ దంపతుల కుమార్తె పాతిమ(18)ను ఏడు నెలల క్రితం గూడలికి చెందిన మనోహర్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. అత్త వేధింపులతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. యువతి మృతిపై గూడూరు డీఎస్పీ గీతాకుమారి విచారణ చేపట్టారు.

కండలేరులో 51.023 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 760, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

పెళ్లకూరు మండలంలోని నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతిరోజూ ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వ తేదీ వరకు 9 ప్రమాదాలు జరిగాయి. 9 మంది మృతిచెందారు. 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆరు లేన్ల రహదారిగా మార్చినప్పటికీ ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సర్వీసు రోడ్లు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడం, రోడ్డుకు ఇరువైపులా ఐరన్ కంచె వేయకపోవడం, అతివేగం, పోలీసులు గస్తీ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

చవటకండ్రిగ వద్ద సైకిలిస్టుపై బోల్తా పడిన ట్రాలీ లారీ(ఫైల్)


- ఒక నెలలోనే తొమ్మిది ప్రమాదాలు
- 9 మంది మృతి
- 25 మందికి గాయాలు
- రాత్రుల్లో కనిపించని పోలీసుల గస్తీ


దొర్లవారిమిట్ట వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన దంపతులు(ఫైల్)


టెంకాయతోపు వద్ద కారు ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రభుత్వం రూ.2 వేల కోట్లతో ఆరులేన్లుగా విస్తరణ చేపట్టింది. అయినప్పటికీ పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు నుంచి నెలబల్లి క్రాస్ రోడ్డు వరకు వున్న 17 కిలోమీటర్ల పరిధిలో ప్రమాదాలు ఆగడం లేదు. తాళ్వాయిపాడు, చావలి చెక్ పోస్టు, చావలి, చెంబడిపాళెం, గుర్రప్పతోట, చిల్లకూరు, టెంకాయతోపు, నెలబల్లి క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇందుకు ఎక్కువగా మద్యం బెల్టు షాపులు, కల్లు దుకాణాలు ఉండడమే కారణమని స్థానికులు చెబుతున్నారు. వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలను అతివేగంగా నడపడం మరో కారణమని అంటున్నారు.

ఒక నెలలోనే తొమ్మిది మంది మృతి

ఫిబ్రవరి 7న టెంకాయతోపు వద్ద కారు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న మందం వెంకటరత్నం (58) అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిబ్రవరి 15న దొర్లవారిమిట్ట వద్ద ఆగి వున్న లారీని కారు ఢీకొనడంతో హైదరాబాదుకు చెందిన మాధవకృష్ణ(48), సరితసుమంగళి(43) దుర్మరణం చెందారు. ఫిబ్రవరి 22న దొర్లవారిమిట్ట గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో నాయుడుపేట మండలం మలయకోటకు చెందిన ఖలీల్ బాషా(48) మృతి చెందాడు. ఫిబ్రవరి 28న చవటకండ్రిగ వద్ద ట్రాలీ లారీ బోల్తా పడడంతో సైకిల్‌పై వెళుతున్న చలంచర్ల రామయ్య(58) అక్కడికక్కడే మృతి చెందాడు. అదేరోజు గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న అక్కగారిపేటకు చెందిన ఇలుపూరి నందగోపాల్(22) మృతి చెందాడు. మార్చి 7న రేణిగుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నెలబల్లి భీమవరానికి చెందిన కట్ల రమణమ్మ(50), తిరుపాల్(58) మృతి చెందారు. అలాగే మార్చి 8న తాళ్వాయిపాడు వద్ద కారును లారీ ఢీకొనడంతో బెంగళూరుకు చెందిన ఎంవీ సతీష్‌కుమార్(40) మృతి చెందాడు. అలాగే మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు.

రాత్రి వేళల్లో గస్తీ శూన్యం

వాహనాల తనిఖీని విస్తృతం చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని పోలీసులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించింది. పోలీసులు తూతూమంత్రంగా తనిఖీ చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రిళ్లు పోలీసుల గస్తీ ఉండడం లేదని, అందువల్లే వాహన చోదకులు అతివేగంగా వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు. రోడ్డు వెంబడి కల్లు దుకాణాలు, మద్యం బెల్టు షాపులు ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బారికేడ్లను కట్టెలపొయ్యికి అడ్డుగా పెట్టుకున్న గ్రామస్తులు

కల్యాణం.. కమనీయం

రాపూరు : మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం కనుల పండువలా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. 6 గంటలకు పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారు తిరుచ్చిలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తదుపరి ఊంజల్ సేవ చేపట్టారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

దొరవారిసత్రం : మండలంలోని జాతీయ రహదారిపై మూడు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కుప్పారెడ్డిపాళెంకు చెందిన మురళీ బైక్‌లో నాయుడుపేటకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది నాయుడుపేటకు తరలించారు. అదే విధంగా అక్కరపాకకు చెందిన నాగరాజు ఆటోలో ఇంటికి వస్తుండగా కారు దూసుకువచ్చింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్ నాగరాజు గాయపడ్డాడు. అతన్ని 108లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టపాయిండ్లు గ్రామ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని చెన్నై వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో డ్రైవర్ షాహుల్‌రహ్మద్ గాయపడ్డాడు. అతన్ని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు శనివారం గూడూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

విభాగం	అధ్యక్షులు	విభాగం	అధ్యక్షులు
యూత్ వింగ్	మాచిరెడ్డి సుధీర్‌కుమార్‌రెడ్డి	వాణిజ్య విభాగం	దుగ్గిశెట్టి సునీల్
మహిళా విభాగం	నాగిశెట్టి శారదమ్మ	చేనేత విభాగం	కటికాల శేషు
రైతు విభాగం	యల్లా శ్రీనివాసులురెడ్డి	వైఎస్సార్‌టీయూసీ	మండ్ల రాజేష్‌కుమార్
బీసీ సెల్	వలిపి శ్రీనివాసులు	అంగన్‌వాడీల విభాగం	జమళ్ళ సుఖన్య
ఎస్సీ సెల్	ఎంబేటి యాదగిరి	లీగల్ సెల్ విభాగం	ఏవీ రాఘవరెడ్డి
ఎస్టీ సెల్	దాసరి కోటయ్య	సాంస్కృతిక విభాగం	వాకాటి అశ్విన్‌రెడ్డి
మైనార్టీ సెల్	గుమ్మనేనిపాళెం జమీల్	సోషల్ మీడియా విభాగం	దువ్వూరు లోకేష్‌రెడ్డి
క్రిస్టియన్ మైనార్టీ సెల్	ఎం.ఎ. స్వరూప్‌రాజన్	ఐటీ విభాగం	అల్లం వెంకట్
విద్యార్థి విభాగం	భూమన నిఖిల్‌సాయి	ప్రచార విభాగం	జక్కంరెడ్డి జనార్ధనరెడ్డి
పంచాయతీరాజ్ విభాగం	డి.విజయభాస్కర్‌రెడ్డి	వైద్య విభాగం	జననాటి బాలక్రిష్ణ
మున్సిపల్ విభాగం	టి. శ్రీనివాసులుయాదవ్	దివ్యాంగుల విభాగం	మన్యం శంకరయ్య
సమాచార చట్టం విభాగం	బి.ఎస్.వినోద్‌కుమార్	మేధావి విభాగం	నందవరం సుబ్బారావు
వలంటీర్ విభాగం	ఎస్‌కే ఖాజా రహంతుల్లా	పోలింగ్ కేంద్రాల విభాగం	వి.నాగరాజు
గ్రీవెన్స్ విభాగం	ఎస్‌కే కాలేషా		

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ


సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో సంస్థ ప్రతినిధులు

చిల్లకూరు : మహిళలు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని తెలుగు గంగ వ్యవసాయాధికారిణి ఉషారాణి తెలిపారు. గూడూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న సునీతా సేవా సంస్థ కార్యాలయంలో శనివారం బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ చదువుకున్న ప్రతి మహిళా కుటుంబానికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఇబ్బంది పెట్టొద్దు

దక్కిలి: పేదలు ఎన్నో ఏళ్ల నుంచి అటవీ పోరంబోకు, మేత పోరంబోకు భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలను ఇబ్బంది పెట్టొద్దని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మహిళలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పీ కోటేశ్వరరెడ్డి, తహసీల్దార్ ఎం శ్రీనివాసులు, ఎంపీడీవో గుణ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో ఇంటింటా సర్వే

వాకాడు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాకాడు ఎంపీడీవో శ్రీనివాసులు శనివారం ఇంటింటా సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలు సేకరించారు. సోమవారం లోపు సర్వే పూర్తి చేసి వాకాడును జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు


నేదురుమల్లిని కలిసిన నాయకులు

సైదాపురం: వైఎస్సార్ సీపీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయనను శనివారం వాకాడులోని తన నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులు కలిశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన నేతలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు గుంటమడుగు శ్రీనివాసులు రాజు, రాజా రెడ్డి, బీఎస్ యాదవ్, శంకర్‌రెడ్డి, చిరంజీవి, గంగయ్య యాదవ్, చాగణం సర్పంచ్ పెంచలయ్య, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు కిలివేటి పరామర్శ


బిరదవాడలో కేవీ రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులను పరామర్శించారు. ఈ నెల 2న బిరదవాడకు చెందిన విశ్రాంత డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ కేవీ రమణయ్య మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుటుంబ సభ్యులను కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. అలాగే నాయుడుపేట బేరిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ నేత టైసన్ తండ్రి బెంజిమెన్(79) శనివారం మృతి చెందారు. వారి నివాసం వద్దకు వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కలికి మాధవ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, దారా రవి, షేక్ షబ్బీర్, నిడిగింటి చిట్టిబాబు, పేర్నాటి రాహుల్, కేఎంవీ కళాచంద్ర పాల్గొన్నారు.

ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో అమీర్ షావలీ దర్గా ఉరుసు


మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటంలోని హజరత్ అమీర్‌షావలీ దర్గా ఉరుసు వేడుకలకు ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో నిర్వహించాలని నిర్వాహకులు తీర్మానించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి కామిరెడ్డి రాజారెడ్డి, న్యాయ విభా గం నియోజవర్గ కన్వీనర్ చదలవాడ కుమార్, దారా రవి, పాపాడి చంద్రారెడ్డి తదితరులు దర్గా కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. దర్గా ఉరుసు ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఇరు వర్గాల వారు కలిసి ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో ఉరుసు నిర్వహించడానికి అంగీకరించారు. తొమ్మిదేళ్లుగా ఉరుసు నిలిచిపోవడంతో భక్తులు బాధపడుతున్నారని, మళ్లీ దర్గా వైభవాన్ని చాటుతూ మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు ఎస్ విజయభాస్కర్ రెడ్డి, నెలవల రాజేష్, యూ ప్రవీణ్, దోర్నాదుల కమిటీకి చెందిన కనమర్లపూడి సుబ్రమణి, పఠాన్ అమీర్‌ఖాన్, వక్ఫ్ బోర్డు కమిటీకి చెందిన నిజాం, సుభాహాని, జామియా మసీదు ముతవల్లీ హాజీ రహతుల్లా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం


చిల్లకూరు: కేసులను పరిష్కరించి రాజీ పత్రాలు అందజేస్తున్న జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం


వెంకటగిరిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

చిల్లకూరు/వెంకటగిరి(సైదాపురం)/నాయుడుపేట టౌన్ : లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందని గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం, నెల్లూరు సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్, వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. గూడూరులోని ఏడో అదనపు జిల్లా కోర్టు, వెంకటగిరిలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. గూడూలో 947 కేసులు, వెంకటగిరిలో 2,032 కేసులు, నాయుడుపేటలో 613 కేసులు పరిష్కరించారు. వారు మాట్లాడుతూ కేసులను రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదాయ అవుతాయన్నారు. సీనియర్ సివిల్ జడ్జి రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ సులోచన రాణి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శంకరయ్య, ఏపీపీ నారాయణ, గూడూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కరరావు, వెంకటగిరి న్యాయవాదులు రాజారామ్, గాంధీ, రాజేష్, నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు కిషోర్, చదలవాడ కుమార్, రఫీ, వీరస్వామి, దారా రవి, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబి, సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి



సైదాపురం : సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు, నాయుడుపేట టౌన్ : మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే విజయశ్రీ

సైదాపురం : సమాజంలో ఎదురయ్యే సమస్యలను మహిళలు ధైర్యంగా ఎదుర్కొని నిలబడాలని ఏపీఎం చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సిబ్బందిని సన్మానించారు. ఏపీఎం శైలజమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సహకార బ్యాంకు రాపూరు బ్రాంచి మేనేజర్ బి.మునిచందన సహకార బ్యాంకు సీఈవో శ్రీనివాసరావు చేతుల మీదుగా బెస్ట్ మేనేజర్ అవార్డు అందుకున్నారు. ఆమెను పలువురు అభినందించారు.

తడలో..

తడ: మండలంలోని కారూరు పంచాయతీ, ఖాశింగాడుకుప్పం ప్రాథమికోన్నత పాఠశాలల్లో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కారూరు సర్పంచ్ నిత్య సుందర్‌రెడ్డి, ఏఎన్‌ఎం పార్వతి, ఆయా శశికళ, వంట మనిషి బాలమ్మను ఉపాధ్యాయులు సన్మానించారు. ఆర్‌కే సుందర్‌రెడ్డి, హెచ్‌ఎం రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

వెంకటగిరి రూరల్/వెంకటగిరి (సైదాపురం) : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మహిళాదినోత్సవం నిర్వహించారు. అంతకుముందు పాత బస్టాండ్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు ఐసీడీఎస్, మెప్మా మహిళలు, ప్రజాప్రతినిధులు ర్యాలీ చేశారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. 324 పొదుపు గ్రూపులకు రూ.48.43 కోట్ల చెక్కు అందజేశారు. అలాగే 9వ బెటాలియన్‌లో ఇన్‌చార్జి కమాండెంట్ అరుణ్‌బోస్ ఆధ్వర్యంలో మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతు లు పంపిణీ చేశారు. ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, సీఐ ఏవీ రమణ, సీడీపీవో శంషాద్‌బేగం పాల్గొన్నారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి అనూష ఆధ్వర్యంలో మహిళల రక్షణకు అమలవుతున్న చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు, న్యాయవాది రాజేష్, గాంధీ, రాజారామ్ పాల్గొన్నారు. అలాగే పద్మశాలి కల్యాణ మండపంలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, దొంతుశారద, యోగా గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత చింతగింజల వసంతలక్ష్మిని సన్మానించారు.

సూళ్లూరుపేట రూరల్‌లో..

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులను సన్మానించారు. సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం మండలాలోని యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆరుగురు మహిళలకు అవార్డులు అందజేసి సన్మానించారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఇందులో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని పొదుపు సంఘాల మహిళలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, చైర్ పర్సన్ కటకం దీపిక, ఎమ్మెల్యే భర్త పార్థు తదతరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. అక్కడ పనిచేస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. పాఠశాలకు రెడ్డి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు చంద్రశేఖరరెడ్డి ప్రింటర్ అందజేశారు. ఉపాధ్యాయురాలు చంద్ర, ఎస్‌ఎంసీ చైర్ పర్సన్ షకీలా, నాగభూషణమ్మ, ఆదిలక్ష్మి, సంధ్యారాణి, లత, సుందరమ్మ, ప్రభావతమ్మ, శాంతి, బ్రజేంద్రరెడ్డి, బండ్ల సుధాకర్, శివరామిరెడ్డి, డీవీ రమణయ్య పాల్గొన్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు : మెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా టీచర్లను సత్కరించారు. హెచ్‌ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాసులు, సంతోష్, విరిత, శంకరమ్మ, విజయలక్ష్మి, సుగుణ, పద్మావతి, ఉదయలక్ష్మి, సుప్రియలు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న బ్యాంకు మేనేజర్ మునిచందన


తడ : సర్పంచును సన్మానిస్తున్న టీచర్లు


వెంకటగిరి రూరల్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల


సూళ్లూరుపేట రూరల్ : కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న పోలీసులు


చిల్లకూరు : మహిళలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపికతో కలిసి నాయుడుపేట స్వర్ణముఖి నది సమీపంలో మున్సిపల్ వాహనాల కోసం ఏర్పాటు చేసిన వాటర్ సర్వీస్ సెంటర్, ఫాగింగ్ మెషిన్లను ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయ భవనం కోసం పాత రెవెన్యూ కార్యాలయం ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కమిషనర్ షేక్ ఫజులుల్లా, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, కౌన్సిలర్లు ధారా రవి, చిందేటి వెంకటేశ్వర్లు, నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్ రెడ్డి, నెలవల రాజేష్, పార్థసారథి, ఉయ్యాల ప్రవీణ్, కట్టా వెంకటరమణా రెడ్డి, ఏకే మణి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభం

సూళ్లూరుపేట డిపోకు సంబంధించి నూతన బస్సును శనివారం ఎమ్మెల్యే విజయశ్రీ ప్రాంభించారు. డిపో మేనేజర్ ఎస్ మల్లికార్జున, ఆర్టీసీ ఎస్ఎంయూ నాయకులు దక్కలి పోలయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు. సూళ్లూరుపేట డిపో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.